క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో లక్ష రుద్రాక్షాభిషేకం



కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న గరిమెళ్ల

కాకినాడ సిటీ: నగరంలోని న్యూపోర్టు రైల్వే స్టేషన్ ఎదురుగా వేంకటేశ్వర నగర్‌లో ఉన్న అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా మహా శివరాత్రి లింగోద్భవ సువర్ణ జల పాశుపత లక్ష రుద్రాక్షాభిషేక మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ గరిమెళ్ల లక్ష్మీనారాయణశర్మ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమాన్ని జరిపించారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు స్వామివారికి విశేష అభిషేకాలు, సుహాసిని అర్చనలు నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు, కవి వేదు శ్రీరామశర్మ పాల్గొన్నారు.

తూరంగేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తజనం

కాకినాడ సిటీ: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం కాకినాడ రూరల్ మండలం తూరంగిలోని తూరంగేశ్వర స్వామి ఆలయం శివనామస్మరణతో మార్మోగింది. తెల్లవారుజాము నుంచే పెద్దఎత్తున భక్తులు విశేష సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు చేశఋరు. ఆలయ కమిటీ, దేవస్థానం వారు భక్తులకు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు స్వామివారిని దర్శించుకున్నారు. ఈఓ శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

వైభవ వేంకటేశ్వరునికి అభిషేకాలు



వైభవ వేంకటేశ్వరస్వామికి నిర్వహిస్తున్న అభిషేకం

కాకినాడ సిటీ: మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక సాంబ మూర్తినగర్‌లోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ నక్షత్రం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

భక్తులకు మజ్జిగ, లస్సీ పంపిణీ

బోట్‌క్లబ్: మహా శివరాత్రి సందర్భంగా స్థానిక భానుగుడి ఉషా రాజరాజేశ్వరి సమేత భాను లింగేశ్వరస్వామి ఆలయం వద్ద బుధవారం ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, లస్సీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఎండ వేడిలో భక్తులు ఇబ్బంది పడకూడదని వీటిని పంపిణీ చేశామని సంఘ అధ్యక్షుడు వీవీ రావు తెలిపారు. సంఘ సభ్యులు నాగేంద్ర, చైతన్య, మనోజ్, కృష్ణంరాజు, శ్రీనివాస్, కిషన్, శ్రీకాంత్, కిరణ్, ప్రదీప్, సందీప్, కుమార్ సేవలందించారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత

కరప: గ్రామంలోని శాంతి బాప్టిస్ట్ చర్చిలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష రాసేందుకు ప్యాడ్, జామెట్రీ బ్యాక్స్, పెన్నులు వంటి వాటిని సర్పంచ్ సాదే ఆశాజ్యోతి అందజేశారు. ఆమె మాట్లాడుతూ, ఇప్పటి నుంచి కష్టపడి చదివి, పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. ఏకాగ్రతతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. విద్యావేత్త షేక్ దాదాజీ మాట్లాడుతూ, విద్యార్థులు ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలన్నారు. చెడు స్నేహాలు చేయకుండా, పట్టుదలతో కృషి చేస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. చర్చిలో పాస్టర్ జయప్రకాష్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం 125 మంది విద్యార్థులకు సామగ్రిని అందజేశారు. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, సిస్టర్ కృప, సిస్టర్ రమ్య పాల్గొన్నారు.

సంగీత విద్వాంసుడు రాధాకృష్ణ కన్నుమూత



రాధాకృష్ణ (ఫైల్)

బోట్‌క్లబ్: ప్రముఖ హిందూస్థానీ సంగీత విద్వాంసుడు పాండ్రంగి రాధాకృష్ణ (60) బుధవారం స్థానిక విద్యుత్‌నగర్‌లోని ఆయన నివాసంలో కన్నుమూశారు. ఆయన భౌతికకాయానికి సంగీత విద్యార్థులతో పాటు, పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనేక బిరుదులు పొందినప్పటికీ, ఆయన నిగర్విగా జీవితాన్ని కొనసాగించారు. హిందూస్థానీ సంగీత వ్యాప్తికి తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి అని పలువురు కొనియాడారు. ఆయన వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు దేశ విదేశాల్లో ఉన్నత స్థానంలో ఉన్నారు. వోకల్ విశారద, తబలా విశారద, తబలా దివాకర్ వంటి ఉన్నత బిరుదులను అఖిల భారత గురుదేవ్ మహా విద్యాలయం నుంచి స్వీకరించారు.



హరిహర ఆరాధన సంఘం ఆధ్వర్యంలో పార్థివ లింగార్చనలో పాల్గొన్న భక్తులు



దేవాలయం వీధిలోని భీమేశ్వరస్వామి ఆలయంలో క్యూలో ఉన్న భక్తులు



కరపలోని పర్వత వర్ధినీదేవి సమేత రామలింగేశ్వరస్వామికి అర్చకుల పూజలు



పెద్దాపురప్పాడులో ప్రత్యేకాలంకరణలో రామలింగేశ్వరస్వామి



అరట్లకట్టలో భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి


శివ నామం.. భక్తజన మంత్రం

- శివనామస్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు
- దర్శనం కోసం క్యూకట్టిన భక్తులు
- స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు

బోట్‌క్లబ్: మహా శివరాత్రి పర్వదినమైన బుధవారం నగరంలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామస్మరణలతో ఆలయాలు మార్మోగాయి. తెల్లవారుజాము నుంచి ఆలయాల్లో అభిషేకాలు నిర్వహించేందుకు భక్తులు క్యూ కట్టడంతో ఆలయాల వద్ద భారీగా క్యూ లైన్లు పెరిగాయి. తెల్లవారుజామున మూడు నుంచి ఆలయాల్లో భక్తులు అభిషేకాలు నిర్వహించి, స్వామి దర్శనం చేసుకున్నారు. నగరంలోని పలు ఆలయాల్లో మధ్యాహ్నం వరకూ క్యూలైన్లు కిటకిటలాడాయి. ఆలయాలకు వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. స్థానిక దేవాలయం వీధిలో ఉన్న పురాతన భీమేశ్వర స్వామి ఆలయంలో స్వామికి తెల్లవారుజాము మూడు నుంచి పంచామృతాభిషేకాలు వైభవంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు దాతల సహకారంతో ప్రసాదం ఉచితంగా పంపిణీ చేసినట్లు ఆలయ కమిటీ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు తెలిపారు. స్థానిక రామారావు పేటలో ఉన్న అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచి భక్తులు క్యూలు కట్టారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్థానిక సూర్యారావుపేటలో ఉన్న బాలత్రిపురసుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. స్వామివారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం వైభవంగా నిర్వహించారు. అమ్మవారు బంగారం చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక రిజర్వు లైన్ అయ్యప్ప స్వామి ఆలయంలో మహా శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులకు ఆలయ పర్సన్ ఇన్‌చార్జ్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భక్తి, సంగీత కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. స్థానిక భోగిగణపతి పీఠంలో స్పటిక శివలింగం తయారు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



భానులింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకం



దేవాలయం వీధిలో భీమేశ్వరునికి అర్చకుల అభిషేకం



భోగి గణపతి పీఠంలో స్పటిక శివలింగం

హరిహర సేవా సమితి ఆధ్వర్యంలో..

స్థానిక రామారావుపేటలోని సౌమ్య ఎన్‌క్లేవ్‌లో హరిహర సేవా సమితి ఆధ్వర్యంలో సామూహిక మహాన్యాస పూర్వక పార్థివ లింగార్చన ఘనంగా నిర్వహించారు. పార్థివ లింగానికి పాలు, పంచదార, తేనె, విబూది, గంధం, కొబ్బరినీళ్లు, పెరుగుతో అభిషేకం నిర్వహించారు. బండముళ్ల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో అర్చన, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సేవా సమితి అధ్యక్షులు నందమూరి వీరవెంకట వినోద్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది పార్థివ లింగార్చనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వేలు గురుస్వామి, పీఠం కార్యవర్గ సభ్యులు పుప్పాల ఉదయభాస్కర్, పబ్బినీడి శ్రీనివాస్, భానోజీరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో మార్మోగిన శివ నామస్మరణ

కరప: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని గ్రామాల్లో బుధవారం శివ నామస్మరణ మార్మోగింది. పలు గ్రామాల్లోని శివాలయాల్లో అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. శివాలయాల వద్ద భక్తులు బారులు తీరి, స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వేకువజాము నుంచే శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కరపలోని అతి పురాతనమైన పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రధానార్చకులు విలపర్తి శ్రీనివాస్, రాజు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్ధరాత్రి లింగోద్భవ పూజలు చేశారు. ఈఓ కె.తిరుమల రవితేజ భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు. చినమామిడాడలోని పంచముఖేశ్వరస్వామి ఆలయంలో వంశపారంపర్య ధర్మకర్త మెర్ల వీరయ్య చౌదరి భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించగా, అర్చకుడు చంద్రమౌళి అన్నపూర్ణేశ్వరశర్మ పూజాదికాలు నిర్వహించారు. అరట్లకట్టలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామికి అర్చకులు కొంతేటి సూర్యదత్త శివ కుమార్ లింగోద్భవ పూజలు చేయగా, ఈఓ మోర్త మురళీవీరభద్రరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పెద్దాపురప్పాడులో ఉమాపార్వతి సమేత రామలింగేశ్వరస్వామికి, నడకుదురులోని బాలాత్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో, గురజనాపల్లిలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి, పెనుగుదురులోని బాలాత్రిపుర సుందరి సీతేశ్వరస్వామి, వేళంగిలోని బాలాత్రిపుర సుందరీ సమేత భవానీశంకరస్వామి, వేములవాడ భీమకవి జన్మ స్థలమైన వేములవాడలో మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, వాకాడలో అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరుడు, కూరాడలోని భద్రకాళీ సమేత వీరేశ్వరుడు, కరపలోని సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో, గొర్రిపూడి బసవేశ్వరస్వామి ఆలయంలో, ఉప్పలంక శివారు మొండిలోని సంగమేశ్వరస్వామి ఆలయంలో, కొరిపల్లిలోని శివాలయాల్లో మహా శివరాత్రి పూజలు, అభిషేకాలు జరిగాయి. నడకుదురు విఘ్నేశ్వరాలయం వద్ద ఉమామహేశ్వరస్వామికి అభిషేకాలు, సహస్ర జ్యోతిర్లింగార్చన పూజలు చేశారు. చెరువులో మాజీ సర్పంచ్ యాసలపు దుర్గాప్రసాద్, కుటుంబ సభ్యులు విద్యుద్దీపాలంకరణతో ఏర్పాటు చేసిన శివ లింగం, శివపార్వతులు భక్తులను ఆకట్టుకున్నాయి.



కరపలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



చినమామిడాడలోని పంచముఖేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

హరహర మహాదేవ.. శంభో శంకర..



రమణయ్యపేట ఆర్టీసీ కాలనీ వద్ద త్రయంబకేశ్వరస్వామికి అభిషేకం

కాకినాడ రూరల్: ముక్కంటిని మొక్కని హిందువులుండరు. లయ కారుడైన శివుడిని ఆపదలో ఏ పేరుతో పిలిచినా పలుకుతాడని భక్తుల విశ్వాసం. అందునా మహా శివరాత్రి అంటే పరమ పవిత్రమైన దినంగా భావిస్తారు. పుణ్యస్నానాలు, శివలింగానికి అభిషేకాలు, ఉపవాస నియమాలు, రాత్రంతా జాగరణ.. ఇలా శివ రాత్రి రోజున వేకువజాము నుంచి లింగోద్భవ కాలాభిషేకాల వరకు భక్తులు పరమ శివుడిని స్మరిస్తూ తరిస్తారు. మహా శివరాత్రి సందర్భంగా బుధవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పుణ్య స్నానాల కోసం మంగళవారం అర్ధరాత్రి నుంచి పిఠాపురం పాదగయ, గోదావరి తీర ప్రాంతాకు తరలివెళ్లారు. కొందరు భకులు సాగర తీరాన సూర్యారావుపేట, నేమాం వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. మండలంలోని నేమాం, పండూరు, తిమ్మాపురం, తూరంగి, సర్పవరం, రమణయ్యపేట గోకుల్ గార్డెన్, ఆర్టీసీ కాలనీ, కొవ్వాడ, రేపూరు, సూర్యారావుపేట తదితర గ్రామాలలో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం దర్శనాలు, అభిషేకాలు చేసుకున్నారు. ఆలయాల వద్ద ఆయా గ్రామాల ప్రజలు భక్తులకు ప్రసాదాలు, అన్న ప్రసాదం వితరణ చేశారు. శ్రీపీఠంలోనూ ప్రత్యేక పూజలు జరిగాయి. రాత్రి ఆర్టీసీ కాలనీలో లింగోద్భవ కాలాభిషేకాలు అర్ధరాత్రి వరకు నిర్వహించారు.

సాగర తీరాన భక్తుల పుణ్యస్నానాలు



కాకినాడ సాగర తీరాన కుంభాభిషేకం వద్ద ఆదికుంభేశ్వరుడికి ప్రత్యేకాభిషేకాలు



పండూరు శివాలయం వద్ద భక్తుల అభిషేకాలు



రమణయ్యపేట ఆర్టీసీ కాలనీ వద్ద మహా శివుడి విగ్రహం వద్ద దీపారాధన

వక్ఫ్ బిల్లును టీడీపీ వ్యతిరేకించాలి

మా అధ్యక్షుడు జవహర్ ఆలీ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ముస్లింల పక్షపాతిగా టీడీపీని చెప్పుకోవాలంటే వక్ఫ్ బిల్లును పార్లమెంట్‌లో వెనక్కు తీసుకునేలా వ్యవహరించాలని ముస్లిం అడ్వకేట్ అసోసియేషన్(మా) కోరింది. పార్లమెంట్‌లో ఈ బిల్లు ఆమోదం పొందకుండా ఆపగల బలం టీడీపీ కూటమికి ఉందని, అందువల్ల ముస్లిం ప్రయోజనాలు కాపాడాలని మా అధ్యక్షుడు మహమ్మద్ జవహర్ అలీ సూచించారు. స్థానిక జేఎన్‌టీయూకే వద్ద ఉన్న మేవా ఫంక్షన్ హాల్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లు రాజ్యాంగానికి వ్యతిరేకమని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం చట్టరూపం కాకుండా ఉపసంహరించేలా చేయాలన్నారు. ఈ సవరణ బిల్లు వల్ల ముస్లిం ఆస్తులు, ఆ సమూహంపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. ఈ సవరణల వల్ల వక్ఫ్ బోర్డులో కేంద్ర అజమాయిషీ పెరగడమే కాక, ఆస్తుల పరిరక్షణకు హానికరంగా మారుతాయన్నారు. ఈ బిల్లును వక్ఫ్ బోర్డుతో పాటు, ముస్లిం సంఘాలు, ఇతర పౌర సమాజ సంస్థలు వ్యతిరేకిస్తున్నాయని గుర్తు చేశారు. కేంద్రం ఏర్పాటు చేసిన జేపీసీలో ఎక్కువగా పాలక పక్షాలు వారే ఉండటం వల్ల ఈ బిల్లు వారికే అనుకూలమయ్యే అవకాశం ఉందన్నారు. కేంద్రంలో బీజేపీ కుటిల యత్నాన్ని పార్లమెంట్‌లో టీడీపీ కూటమి ప్రభుత్వం అడ్డుకునేలా చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మా సభ్యులు ఎస్.ఎజాజుద్దీన్, మహమ్మద్ ఇక్బాల్, ఇక్బాల్ ఆలీ, అల్తాఫ్ మహమ్మద్, మహమ్మద్ సియాజుద్దీన్, సయ్యద్ సాలార్, దీన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జవహర్ అలీ

చాక్ పీస్‌పై శివలింగం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): మహా శివరాత్రి సందర్భంగా కాకినాడకు చెందిన సూక్ష్మ కళాఖండాల కళాకారుడు ఆరిపాక రమేష్‌బాబు చాక్‌పీస్‌ని ఉపయోగించి అతి చిన్న శివలింగాన్ని రూపొందించారు. ఈ శివలింగానికి ప్రత్యేక ఆకర్షణగా రాగి త్రిశూలాన్ని, డమరుకాన్ని కూడా తయారు చేశారు. ఈ శివలింగం ఎత్తు ఒక సెం.మీ. కాగా, త్రిశూలం 1.5 సెం.మీ. మహా శివరాత్రి సందర్భంగా అందరికీ పరమశివుని కటాక్షం కలగాలని దీనిని రూపొందించినట్లు రమేష్‌బాబు చెప్పారు.



చాక్‌పీస్‌పై అతి చిన్న శివలింగం (అంతర చిత్రం) రమేష్‌బాబు

చోరీలకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

కాకినాడ క్రైం: కాకినాడ నగరంలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను వన్ టౌన్ సీఐ నాగదుర్గారావు గురువారం రాత్రి వెల్లడించారు. నగరంలోని ఏటిమొగకు చెందిన రేకాడి వెంకటేశ్వర్లు తలుపులు తెరిచి ఉన్న ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలు చేసేవాడు. తలుపులు దగ్గరగా వేసి లేదా గడియ పెట్టకుండా ఉన్న ఇళ్లల్లో అతడు వరుస చోరీలకు పాల్పడ్డాడు. ఇలా జూన్ 2024 నుంచి 14 దొంగతనాలు చేశాడు. ఆయా నేరాల్లో 200 గ్రాముల బంగారు ఆభరణాలను దోచుకున్నాడు. గురువారం విశ్వసనీయ సమాచారంతో వెంకటేశ్వర్లును కాకినాడ వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. అతడు ఇచ్చిన సమాచారంతో 200 గ్రాముల చోరీ సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సిద్ధం

కరప: ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తహసీల్దార్ ఎన్.సత్యనారాయణ తెలిపారు. మండలంలో 2,481 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా, వీరి కోసం కరపలో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కరపలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, కరపలోని నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ హైస్కూల్, మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఐదుగురు వంతున సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని వివరించారు.

రూరల్‌లో 13 పోలింగ్ కేంద్రాలు

కాకినాడ రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు అధికార యంత్రాంగం పూర్తి ఏర్పాట్లు చేసింది. కాకినాడ రూరల్ మండలంలో మొత్తం 13 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. 10,499 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ కేంద్రాలు కాకినాడ రూరల్ మండలంలో రమణయ్యపేట ఏపీఎస్పీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదు పోలింగ్ స్టేషన్లు 126 నుంచి 130 వరకు, వాకలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ స్టేషన్లు 131, 132, తూరంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ స్టేషన్లు 133, 134, ఇంద్రపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాలుగు పోలింగ్ కేంద్రాలు 135, 135ఎ, 136, 137ను ఏర్పాటు చేశారు. సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, డీఆర్వో వెంకటరావు పర్యవేక్షణలో అధికారులు పర్యవేక్షిస్తున్నారు. పోలింగ్ కేంద్రాలను రూరల్ తహసీల్దార్ కుమారి బుధవారం పరిశీలించారు.

యువకుడి ఆత్మహత్య

కాకినాడ రూరల్: గంగనాపల్లి గ్రామానికి చెందిన ఈమని వెంకటసాయి శివరామకృష్ణ(21) గడ్డి మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఇంద్రపాలెం పోలీసుల వివరాల మేరకు, దురలవాట్లకు బానిసైన అతడు మంగళవారం ఇంట్లో గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని స్థానిక జీజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకట సీతారామాంజనేయులు ఫిర్యాదు మేరకు ఎస్సై వీరబాబు కేసు నమోదు చేశారు.

మరో జీబీఎస్ కేసు

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో మరో జీబీఎస్ కేసు నమోదైంది. గురువారం వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు వ్యక్తిలో జీబీఎస్ నిర్ధారించారు. దీంతో కాకినాడ జీజీహెచ్‌లో బాధితుల సంఖ్య నాలుగుకు పెరిగింది.

పెద్దలకు మైనర్ బిగ్‌షాక్

- ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనల్లో 18 ఏళ్లలోపు వారే అధికం
- బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న వైనం
- అటువంటి వారిపై గట్టి నిఘా
- బాధ్యులుగా తల్లిదండ్రులు

కాకినాడ క్రైం: ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనల్లో అధిక సంఖ్యలో మైనర్లు ఉండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. నగరంలో ఈ సమస్య మరింత తీవ్రంగా మారింది. అవగాహన లేక, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నది కొందరైతే, తల్లిదండ్రుల మితిమీరిన గారాబం మరికొందరి మైనర్ల జీవితాలకు శాపంగా పరిణమిస్తోంది. పోలీసులు ఎంత మొత్తుకుంటున్నా, చెవిటి వాని ముందు శంఖం ఊదిన చందంగా తయారైంది మైనర్ల వ్యవహార శైలి.



మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్పీ

డ్రోన్ల సహకారంతో..

మైనర్ల డ్రైవింగ్ పోలీస్ శాఖకు తలనొప్పిగా మారింది. రాంగ్ రూట్లలో కూడా దూసుకొస్తూ, పోలీసుల్ని చూసి ఆకస్మికంగా వాహనాన్ని వెనక్కి పోనిచ్చి తమ ప్రాణాలతో పాటు, ఇతర ప్రయాణికులు, పాదచారుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టేస్తున్నారు. నగరంలో పలు చోట్ల రేసులు నిర్వహిస్తున్నారన్న సమాచారం పోలీసులకు ఉంది. అతి వేగం, ట్రిపుల్ రైడింగ్ కూడా మైనర్ల వల్ల కలుగుతున్న సమస్యలు. వీటికి చెక్ పెట్టడానికి పోలీస్ శాఖ సాంకేతికతను వినియోగించుకుంటోంది. అనుమానిత ప్రాంతాలు, కూడళ్లలో డ్రోన్ల నిఘా కొనసాగిస్తోంది.

ఎన్ని సమస్యలో...

మైనర్లపై కఠినంగా వ్యవహరించడానికి అవకాశం లేకపోవడం కొందరికి కలిసొస్తుంది. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన ఒక్క వయసుకే పరిమితం కాలేదు. మాడిఫైడ్ సైలెన్సర్లు వినియోగించడం, రాంగ్ పార్కింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్‌లతో పేట్రేగిపోతున్నారు. కొద్ది నెలల క్రితం ప్రతాప్‌నగర్ సామర్లకోట హైవేపై ఓ మైనర్ అతివేగంగా వచ్చి ట్రాఫిక్ తనిఖీలు చేస్తున్న పోలీసుల్ని చూసి, ఆకస్మికంగా వన్‌వేలో తన బైక్‌ను వెనక్కి తిప్పాడు. ఈ క్రమంలో డివైడర్‌కు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు.

ప్రమాదాలు, ప్రాణనష్టం..

- మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం.
- డ్రైవింగ్ నైపుణ్యం లేక ప్రమాదాలు, ప్రాణ నష్టం వాటిల్లవచ్చు.
- వారితో పాటు, ఇతర ప్రయాణికులు, పాదచారులకూ ప్రమాదం, ఆస్తినష్టం.
- చట్టప్రకారం మైనర్లతో పాటు, వారి తల్లిదండ్రులు, వాహన యజమానులు కూడా శిక్షార్హులే.
- 2019లో సవరించిన మోటార్ వాహనాల చట్ట ప్రకారం రూ.25 వేల జరిమానా, వాహన రిజిస్ట్రేషన్ రద్దు.
- మైనర్ డ్రైవింగ్ వల్ల ప్రమాదం జరిగితే బీమా రాదు.
- మైనర్లు పట్టుబడి, కేసులు నమోదైతే భవిష్యత్తుపై దుష్ప్రభావం.
- మైనర్లు పట్టుబడితే 18 ఏళ్లు నిండినా లైసెన్స్ మంజూరులో చిక్కులు.



నూని రమేష్, సీఐ, ట్రాఫిక్-1, కాకినాడ

అవగాహన కల్పించాలి



18 ఏళ్లు నిండిన తర్వాత మాత్రమే డ్రైవింగ్ లైసెన్సుతో వాహనం నడపాలి. తల్లిదండ్రులు తమ పిల్లలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి. పాఠశాలలు, కళాశాలల్లో డ్రైవింగ్ నిబంధనలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందేలా కృషి చేస్తున్నాం. సదస్సులు నిర్వహిస్తున్నాం. తల్లిదండ్రులు తమ పిల్లలను అతి గారాబం చేయొద్దు. మైనర్లకు వాహనాలు కొనివ్వొద్దు.

– డి.రామారావు, సీఐ, ట్రాఫిక్-2, కాకినాడ

పెరుగుతున్న కేసులు

నగరంలో మైనర్ల డ్రైవింగ్ కేసులు నానాటికీ పెరుగుతున్నాయి. గత ఆరు నెలల్లో మొత్తం 517 మంది మైనర్లు నిబంధనలు ఉల్లంఘించి ద్విచక్ర వాహనం నడిపుతూ పట్టుబడ్డారు. గతేడాది ఆగస్టులో 62 మంది, సెప్టెంబర్‌లో 70, అక్టోబర్‌లో 66, నవంబర్‌లో 81, డిసెంబర్‌లో 76 మంది పోలీసులకు దొరికారు. ఈ ఏడాది జనవరిలో 92, ఫిబ్రవరిలో 70 మంది మైనర్లు ట్రాఫిక్ తనిఖీల్లో పట్టుబడ్డారు.